క్లుప్తంగా

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆదివారం పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు అన్నదానం చేశారు. న్యాయవాదుల సంఘ కోశాధికారి కొత్రి రమణ పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, మహేందర్ రెడ్డి, సలీమ్, శుభాష్, అంబయ్య పాల్గొన్నారు.

యువత ఐక్యంగా ఉండి ఉపాధి పొందాలి


సౌండ్‌సిస్టం అందజేస్తున్న సోయం వెంకటేశ్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత ఐక్యంగా ఉండి ఉపాధి పొందాలని జిల్లా ఎంపీ సోయం బాపురావ్ తనయుడు సోయం వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని సాకేర(బి) గ్రామ యూత్ కమిటీ సభ్యులకు సుమారు రూ. 1 లక్ష రూపాయల విలువగల సౌండ్ సిస్టం అందజేశారు. యువజన కమిటీలకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సోయం రాందాస్, మాజీ సర్పంచ్ లింగు, చిక్రం రాము పాల్గొన్నారు.

'నారాయణబాబాను స్ఫూర్తిగా తీసుకోవాలి'

తాంసి: నారాయణబాబాను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒకరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని, సమాజసేవ చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని వామన్‌నగర్‌లో నారాయణబాబా ఆశ్రమాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామానికి ఇళ్ల నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆశ్రమంలో షెడ్డు నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తానన్నారు. ఇందులో అధ్యక్షుడు పోచ్చన్న, నాగారెడ్డి, వినోద్ రెడ్డి, మహేందర్, కేదారేశ్వర్ రెడ్డి, మొట్టె కిరణ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

బోథ్: బోథ్ మండలంలోని కౌట గ్రామానికి చెందిన ముదిరాజ్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సున్నపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మహిళలు, విద్యార్థులు

తాంసి: తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి ప్రయాణ కష్టాలు తీర్చాలని వామన్‌నగర్ గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కోరారు. ఆదివారం తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు, విద్యార్థులు కలిసి విన్నవించారు. బస్సు సౌకర్యం లేక ఉన్నత చదువుకు దూరం అయ్యే పరిస్థితి నెలకొందన్నారు.

హనుమాన్ పల్లకి ఊరేగింపు

తాంసి: మండల కేంద్రంలో హనుమాన్ భక్తులు వైభవంగా హనుమాన్ పల్లకి ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తి గీతాలు ఆలపిస్తూ.. శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కృష్ణ, రామన్న, హనుమాన్‌దీక్షదారులు రాకేశ్, కృష్ణ, శివ, రాములు పాల్గొన్నారు.

కొబ్బరిబోండాలకు గిరాకీ



ఇచ్చోడ: ఎండలు దంచికొట్టడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం మండల కేంద్రంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరిబోండాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కొబ్బరి బోండాల దుకాణాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు.

జాడలేని భూసార పరీక్షలు


చేనులో మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

- అవగాహన కల్పించని అధికారులు
- అయోమయంలో రైతులు

బజార్‌హత్నూర్: పంటల సాగులో అధిక దిగుబడులు సాగించేందుకు మట్టి కీలక పాత్ర పోషిస్తుంది. అట్టి మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేసి వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు. కాని గత రెండు సంవత్సరాలుగా భూసార పరీక్షల జాడలేదు. వానాకాలం సాగు పనులు, వ్యవసాయ దుక్కులు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా.. మట్టి నమూనాల సేకరణ జరగలేదు. ఒక వైపు రైతులు వానాలకాలం సాగుకు సిద్ధం అవుతుంటే అధికారులు మాత్రం భూసార పరీక్షల ఊసే మర్చారు. మండలంలో 36 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో ఎక్కువ శాతం మెట్ట ప్రాంతం నల్లరేగడి నేలలు ఉన్నాయి. వానాకాలంలో సూమారుగా 20 వేల ఎకరాల్లో పత్తి, 8వేల ఎకరాల్లో సోయాబీన్, 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 4 వేల ఎకరాల్లో పెసర, మినుము, జొన్న, కంది, కురగాయలు సాగు చేస్తారు. ప్రతీ సంవత్సరం పంటల మార్పిడి లేకుండా అవే పంటలు పండించడంతో దిగుబడి రావడం లేదు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి భూసార పరీక్షలు చేయించి ఏ పంట వేయాలో రైతుకు తెలియజేస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

అనేక ప్రయోజనాలు..

భూసార పరీక్ష కేంద్రాల్లో మట్టి నమూనాలపై పరీక్షలు నిర్వహించి ఆయా మట్టిలో లభ్యమయ్యే ఎన్‌పీకే, సూక్ష్మదాతువులు ఇనుము, జింక్, బోరాన్ ఇతర సేంద్రియ కార్బనం, పీహెచ్, మొదలగు వాటిని గురించి రైతులకు అందిస్తారు. అంతే కాకుండా ఆ భూమి అనుకూలతలను బట్టి ఏ పంటలు వేయాలో, ఏ ఎరువును ఎంత మోతాదులో వాడాలో చెప్పడమే కాక సమగ్ర పోషక యాజమాన్యం గురించి తెలియజేస్తారు. దాని ఆధారంగా రైతులు అవసరమైన ఎరువులు మాత్రమే వాడి నేలకు పోషకాలు అందిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

అవగాహన కల్పించాలి



ప్రతీ సంవత్సరం వేసవి దుక్కులు దున్ని తొలకరి వర్షాలకు విత్తనాలు నాటుతాం. పంటలు పండిస్తున్నామన్న మాటే తప్పా అధిక దిగుబడులు రావడం లేదు. వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు చేసి మా భూమిలో ఏ పోషకాలు అవసరమో తెలియజేస్తే వాటిని వాడి దిగుబడులు సాధిస్తాం.

– నారడి లింగన్న, రైతు, బజార్‌హత్నూర్

భూసార పరీక్షలు చేయిస్తాం



భూసార పరీక్షలు చేయించేందుకు ఆ సక్తి ఉన్న రైతు ఏఈ వోకు తెలియజేస్తే మ ట్టి నమూనాలు సేకరిస్తాం. సేకరించిన మట్టి నమూనాలను ఆదిలాబాద్ పట్టణంలో వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రంలో సాయి ల్ టెస్టింగ్ చేసి రెండు రోజుల్లో ఫలితాలను రైతులకు వివరిస్తాం.

– ప్రమోద్‌రెడ్డి, ఏవో, బజార్‌హత్నూర్

పొంచి ఉన్న ప్రమాదం



ఇంద్రవెల్లి మండలంలోని గిన్నెర గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు గత సంవత్సరం కురిసిన వర్షాలకు కోతకు గురైంది. అయినా.. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం మరమ్మతులు కూడా చేయలేదని వాహదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తలమడుగు: అకాల వర్షానికి, ఈదురు గాలులకు ఇల్లు రేకులు కొట్టుకుపోయి నష్టపోయిన బాధితులు ఎవరూ అధైర్య పడొద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పూనగూడ, ఝరి, పల్సి గ్రామాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. అలాగే దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఎవరూ అధైర్య పడొద్దని వారికి ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు. బాధితులకు అనిల్ అన్న యువ సైన్యం సొసైటీ ఆధ్వర్యంలో 30 మందికి తాత్కాలిక నివాసం కోసం తాడిపత్రిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కుమార్, అభిరామ్ రెడ్డి, అబ్దుల్లా, చంటి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం


బేల: నగదు అందజేస్తున్న సామ రూపేశ్‌రెడ్డి


తలమడుగు: ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

బేల: మండలంలోని సోన్‌కాస్ గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో సతమతవుతున్న లెన్‌గురే శ్రీరాం కుటుంబానికి రూ.5వేల నగదును ఆదివారం ఆదిలాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద నాణ్యమైన వైద్యం అందేలా చూస్తానన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో నిరుపేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కన్న రాజు, బొత్రే శంకర్, గోడే అవినాష్, ఠాక్రే విపిన్, బాపురావు, నవీన్,రాజ రాం, నకతేదత్తా, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన దాసరి రవికి ఆదివారం మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ. 45 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న మాట్లాడుతూ సుంకిడి గ్రామానికి చెందిన దాసరి రవి గత కొన్ని రోజులుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకునేందు ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్రాంతికుమార్, మగ్గిడి ప్రకాష్, ప్రవీణ్, లింగన్న, హర్ష దేవిదాస్, శశికాంత్, సత్యనారాయణ, ప్రశాంత్, బత్తుల విశ్వాంబర్, సాయిబాబా, శ్రీనివాస్, మహేందర్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన చిన్న బుజ్జవ్వ ఆదివారం పాము కాటుకు గురైంది. స్థానిక ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను మాజీ సర్పంచ్ సురేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 2 వేల ఆర్థిక సాయం అందజేశారు. సాయినగర్ కాలనీలో పాముల బెడద లేకుండా అధికారులు చూడాలని కోరారు.

సబ్సిడీపై సోయా విత్తనాలు అందించాలి

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం సోయావిత్తనాలను సబ్సిడీపై అందించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి తర్వాత అత్యధికంగా సోయా పంట పండిస్తారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సోయా విత్తనాలపై సబ్సిడీ ఎత్తి వేయడంతో రైతులు నష్టపోయారని అన్నారు. 50 శాతం సబ్సిడీపై సోయా విత్తనాలు అందచేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

వైద్య పరీక్షలు

బేల: మండల కేంద్రంలోని తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కార్మికశాఖ, సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు ఉన్న కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికీ 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని సీఎస్‌సీ జిల్లా కోర్డినేటర్ సయ్యద్ పర్వేజ్ తెలిపారు. లేబర్‌కార్డు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ కేర్ క్యాంప్ కోఆర్డినేటర్ అబ్దుల్ ఖదర్ సుఫీ, సామాజిక కార్యకర్తలు వెంకన్న, హరీశ్, రితేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నార్నూర్: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖఏఈ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. వినియోగదారులు, మండల వాసులు గమనించి సహకరించాలని కోరారు.

బీడీ వేతన ఒప్పంద చర్చలు సఫలం

ఎదులాపురం: బీడీ కార్మిక యూనియన్, బీడీ యాజమాన్య సంఘానికి మధ్య శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన వేతన ఒప్పంద చర్చలు సఫలమైనట్లు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ తెలిపారు. ఆదివాకం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులు, యూనియన్ల పోరాటాల ఫలితంగానే చర్చలు సఫలమైనట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న ఏడు లక్షల మంది కార్మికులకు మేలు జరగనుందన్నారు. పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

నార్నూర్: రైతులకు నకిలీ విత్తనాలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలని రైతు ఉత్సవ సమితి నాయకులు అర్జున్ జాదవ్ అన్నారు. ఆదివారం నాగల్‌కొండ గ్రామంలో రైతులను కలిసి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి అనేకమంది పత్తి నకిలీ విత్తనాలు అమ్మేందుకు గ్రామాకలు వస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై వ్యవసాయ శాఖ, పోలీస్‌శాఖ, రెవెన్యూ సిబ్బంది పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్మితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట యువ రైతులు జితేందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పీడీయాక్ట్ నమోదు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: నకిలీ విత్తనాల డీలర్లపై పీడీయాక్ట్ నమోదు చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్యపోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, కార్యనిర్వాహక అధ్యక్షుడు నలగంటి నవీన్, ప్రధాన కార్యదర్శి దర్శనాల నగేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న, తయారు చేస్తున్న వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న ముఠాను పట్టుకోవడం జరిగిందని, వారిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతు పట్టుబడిని సామ అశోక్‌రెడ్డి, రాజేందర్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే అసలు సూత్రధారులను గుర్తించేందుకు రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కస్టడీలోకి తీసుకొని విచారణ చేపట్టాలన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

బోథ్: మండలంలోని పలు విత్తన దుకాణాల్లో బోథ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్సై రాము తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలకు వచ్చిన స్టాక్, రికార్డులను పరిశీలించారు. విత్తనాలు విక్రయించేటప్పుడు రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని సాయినగర్‌లో గల రేణుక మాతా (ఎల్లమ్మ) ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఆలయ వార్షికో త్సవాలను పురస్కరించుకొని వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం జమదగ్ని మహర్షి రేణుక మాతా కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఉదయం నుంచి విఘ్నేశ్వర పూజ, పున్యహవచనం, రక్షాబంధనం, రుత్విక వరణం, పంచగవ్య ప్రాశనం, అభిషేకం పూజాది కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వేద పండితులు ఫణతుల ప్రవీణ్ శర్మ బృందం ఆధ్వర్యంలో మంత్రోచ్చరణాల నడుమ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నెమలికొండ బాలుశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: ప్రముఖ రిమ్స్ రేడియాలజిస్ట్ వైద్యుడు కళ్యాణ్ రెడ్డిని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నాయకులు వేముల నాగరాజు, సాయి చరణ్, చంద్రశేఖర్, గోవర్ధన్ రెడ్డి, నవీన్ రెడ్డి, రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



నేరడిగొండ: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్మల్ జిల్లా మంజులాపూర్‌లో గల సిరి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు లింగారెడ్డి, నారాయణగౌడ్, గణపతి, గంగయ్య, అబ్దుల్, లచ్చన్న, నారాయణ వర్మ, పద్మ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తలమడుగు: మండలంలోని పూనగూడ, మందగూడ, చింతగూడ గ్రామాల్లో బుధవారం కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన బాధితకుటుంబాలకు శ్రీమహలక్ష్మీ స్వచ్ఛంద సంస్థ బరంపూర్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పట్న నర్సయ్య, ఉపాధ్యక్షుడు కుషన్ పల్లి, గంగారాం, గోక జీవన్‌రెడ్డి, ప్రభు, చింతల గంగారెడ్డి, తలారి అజయ్, మెరుగు నారాయణరెడ్డి, నిట్టడి గంగాధర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి


వేద పండితుడి ఆశీర్వచనాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత మార్గంలో నడవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనరసింహ స్వామి యోగీశ్వర పీఠంలో నిర్వహిస్తున్న రాజ్యశ్యామల యాగంలో ఆదివారం పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. లోక కల్యాణార్థం శ్రీరాజశ్యామల మహాయాగాన్ని నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యాగం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. జిల్లాలోని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావనలను అలవర్చుకొని, ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాగం నిర్వాహకులు, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వకుళాభరణం ఆదినాథ్, పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్ పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు


గంగనీళ్లతో గ్రామస్తులు

జైనథ్: మండలంలోని ఖాప్రి గ్రామస్తులు గంగ నీళ్ల కోసం పోటెత్తారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున కాలినడకన ఉమ్రి మీదుగా బేల మండలం సాంగిడి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ పెన్‌గంగ నదిలో దిగి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నది నీళ్లను వెంట తెచ్చుకొని, గ్రామంలోని పోచమ్మ తల్లి, హనుమాన్ ఆలయం, శ్రీ కృష్ణాలయం, శివాలయాల్లో దేవత విగ్రహాలకు అభిషేకించారు. మహిళలు పిండి వంటలను గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించారు. ఈఏడాది వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు బాగా పండాలని, సమస్త మానవాళితో పాటు జంతుజీవాలు, పశుపక్షాదులు రోగాల బారిన పడకుండా సల్లంగా ఉండాలని మొక్కుకున్నారు.

పంటలు సమృద్ధిగా పండాలి

నేరడిగొండ: వర్షాకాలం ఆరంభానికి ముందు వడూర్ గ్రామస్తులు గ్రామదేవతలకు పూజల చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఆదివారం గ్రామస్తులందరూ కలిసి దేవత విగ్రహాలకి పూజలు చేశారు. డప్పు వాయిద్యాలతో శోభాయాత్ర చేపట్టారు. పాడి పంటలు సమృద్ధిగా పండి, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు.

సొంత ఖర్చుతో చెరువు తూముకు మరమ్మతు


మరమ్మతులు చేయిస్తున్న రైతులు

తలమడుగు: మండలంలోని కొత్తూరు గ్రామంలోని చెరువు తూముకు రైతులు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా.. పట్టించుకోక పోవడంతో తలకొంత డబ్బులు జమ చేసి పనులు చేపట్టారు. వర్షాలు కురిస్తే పనులు చేయించే అవకాశం ఉండదని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు అభివృద్ధికి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.